

## పువ్వుల్లోని విగ్రహాలు నవ్వాయి

అమరావతి దేవాలయంలో పది కుటుంబాలవారు అర్చకులు. అందరి అర్చకుల్లోకి పెద్ద, పెద్దయ్యగారు. పెద్దయ్యగారి కొడుకు నారాయణ ఆరేళ్ళ పసివాడు. అక్షరాభ్యాసం చేసి ఎంతో కాలం కాకపోయినా, అ-ఆ-లు సొంతం రాకపోయినా కుంచెకోలతో పెద్దగుడి తలుపులు తీయటం చేతనవు. స్వామి దగ్గర అఖండ దీపారాధన కునికిపోకుండా చూడటం చేతనవు. స్వామి నిర్మాల్యం తీయడం చేతనవు. శఠగోపురం పెట్టడం చేతనవు. కాని డబ్బులు లెక్కెట్టుకోటం చేతకాదు.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటాక పెద్దయ్యగారు అర్చకుల ఇంటింటికీ వెళ్ళి "ఒరేయ్ గోపాలం నైవేద్యం .... ఒరేయ్ కృష్ణమూర్తీ నైవేద్యం" అంటూ చెప్తుంటే పక్కనున్న నారాయణ తనతోటి వయసు వాళ్ళతో "ఒరే సుబ్బీ నైవేద్యం! ఒరే కంకుపక్షీ నైవేద్యం ....." అని తన జతగాళ్ళని కేకేసేవాడు.

పదిమందీ అర్చకులు నైవేద్యప్పళ్ళాలు తీసుకుని దేవాలయానికి బయలుదేరితే

వాళ్ళవెనుక ఆరేడేళ్ళ పిల్లలు మడిగట్టుకుని తండ్రుల వెంట బయలుదేరేవారు. ఇళ్ళదగ్గర తల్లుల్ని వేధించి పిల్లలు అంగోస్త్రాలు గోచీ పోసీ కట్టింపించుకునే వారు. వాళ్ళు కూడా చిన్న చిన్న నైవేద్యాలు చిన్న పళ్ళాల్లో పెట్టించుకుని, గ్లాసుల్తో నీళ్ళు తీసుకుని తండ్రులవెంట బయలుదేరేవారు.

ముందు పదిమంది అర్చకులు పెద్ద పళ్ళాలతో మహా నివేదన తీసికెళ్తుంటే వాళ్ళవెంట మరో పది చిన్న నైవేద్యాలు! గోచీలూడి పోతుంటే మళ్లీ దోపుకుంటూ తండ్రుల వెంట గునగున నవ్వుతూ పరుగెత్తుతున్న పిల్లలు. కాళ్ళు సర్రున కాలుతున్నా లెక్కచేయకుండా, గ్లాసుల్లో నీళ్ళు తొణికిపోతున్నా గమనించకుండా పోటీపడి పరుగెత్తటాలు. అలా రెండవ ప్రాకారంలోకి వచ్చేసరికి అక్కడ పరిచివున్న నాపరాయి బండలు ఎండకి సలసల కాగుతుంటే వాటిమీద పిల్లల లేతపాదాలు సర్రున కాలిపోగా పిల్లలు పరుగెత్తినంత దూరం పరుగెత్తి ఇక లాభంలేదని గ్లాసుల్లో నీళ్ళు కాసిని ఆ బండమీద వొంపుకొని ఆ నీళ్ళలో నుంచునేవారు. మండుతున్న బండలమీద ఆ నీళ్ళు బుస బుస పొంగి కాళ్ళు మరీ కాలేవి. "కుయ్యో" మంటూ మెట్లవైపు పరుగులు పెట్టేవారు. వొద్దంటే విన్నార్రా అన్న పెద్దల మందలింపులు విన్పించుకోకుండా.

ఎట్టకేలకు గుళ్లోకి చేరుకుని నైవేద్యప్పళ్ళాలు స్వామి ముందు పెట్టి గంధం సాన ముందు చేరేవారు. గంధం చెక్క తీసుకుని ఆ పెద్ద సానమీద చేతులు నొప్పులు పుట్టేదాకా వంతులవారీగా గంధం అరగతీసేవారు. వాళ్ళ పెద్దలు గంధం, కుంకుమ పెట్టుకుని, పిల్లలందరికి గంధం బొట్టు పెట్టి వొంటినిండా గంధం పూసేవారు. ఆపైన ధూపదీపాలిస్తున్నప్పుడు, గంటలు, జేగంటలు మోగించడం పిల్లల వంతు. అలా మహానివేదనలు ముగించుకుని నుదుట గంధాక్షతలు వెలుగుతూండగా ఇరవై నైవేద్యప్పళ్ళాలు గుడిమెట్లు దిగుతూంటే చూడవలసిందే!

'శివరాత్రి ఉత్సవాలగ్గాను పులికాపు చెయ్యాలి రండర్రా' అని పెద్దయ్యగారు పెద్దలందర్నీ తొందరచేస్తే నారాయణ పిల్లల్నందర్నీ కూర్చి "మేమూ వస్తాం"

అన్నాడు. సరే అన్నారు పెద్దలు. పులికాపు అంటే స్వామి విగ్రహాలకు స్నానం చేయించి, కొత్తబట్టలు కట్టడం. ఒక విగ్రహమా? రెండా? దాదాపు పది విగ్రహాలు! కంచుపోత పోసిన విగ్రహాలు! నాలుగున్నర అడుగులెత్తు విగ్రహాలు! నలుగురు పడ్తేగాని కదలని విగ్రహాలు!

విగ్రహాలన్నింటిని ఉత్తర మంటపంలోకి చేర్చారు. పెద్దలు విగ్రహాలు మోస్తుంటే పిల్లలు కూడా ఓ పక్క పట్టుకుని మోస్తున్నట్లు నటిస్తూ వాళ్లతోపాటే అమ్మ! అయ్య! అంటున్నారు. రెండు గుండిగల నీళ్ళు కృష్ణనించి తెచ్చారు. పిల్లలు కూడా పానకం బిందెలతో నీళ్ళు మోశారు. విగ్రహాలన్నింటినీ ముందు చింతపండు పులుసుతో తోమారు. ఆపైన ఇసక తెన్నెల్లోంచి ప్రత్యేకంగా తెచ్చిన మెత్తటి ఇసుకతో విగ్రహాల్ని రుద్ది తళతళలాడేట్టు చేశారు.

ఆపైన విగ్రహాలకు బట్టలు కట్టాలి. అమ్మవారికి చీర, అయ్యవారికి ధోవతి, చండీశ్వరుడికి పాగా, ఊరేగింపు విగ్రహాలకు వేరే బట్టలు, ఇలా అలంకారాలు చేయాలి. అందరూ తలా ఒక విగ్రహానికి బట్టలు కడ్తున్నారు. పెద్దయ్యగారు చిన్న ఉత్సవ విగ్రహాలకు బట్టలు కడుతున్నారు. ఆ విగ్రహాలే ఆ రోజు నందివాహనం మీద ఊరేగింపుకు వెళ్తాయి. నారాయణ మెల్లిగా తండ్రి దగ్గరకు చేరాడు.

"ఏరా! నువ్వు అలంకారం చేస్తావా?" అన్నాడు పెద్దయ్య

"ఓ" అన్నాడు నారాయణ.

"అయితే కుచ్చిళ్ళు గట్టిగా పట్టుకో" అన్నాడు పెద్దయ్య.

పెద్దయ్య విగ్రహానికి ముడి వెయ్యటమేమి, నారాయణ వెనకనుంచి ముడి విప్పటమేమి- అలా అరగంటైనా అలంకారం పూర్తి కాలేదు.

పెద్దయ్య నవ్వుతూ "ఒరేయ్! నాయనా ఇలా ముందుకొచ్చి కూర్చో" అని అలంకారమంతా పూర్తిచేశాడు.

అలంకారమంతా తనే చేసినంత తృప్తి వచ్చింది నారాయణకి. అమ్మవారి చీర

సర్దాడు. స్వామి ఉత్తరీయం సరిచేశాడు. దూరంనించి చూశాడు. దగ్గరనుంచి చూశాడు. పూసల పేర్లు దిద్దాడు. ఇలా అలంకారమంతా పూర్తిచేసిన గర్వంతో మిగతా పిల్లల్నందర్నీ చూశాడు. నారాయణకి చటుక్కున ఓ ఆలోచనొచ్చింది. "ఇప్పుడే వస్తా ....." అని రయ్యిన ఇంటికి పరుగెత్తికెళ్ళి దొడ్లో ఆ రోజే విచ్చుకున్న రెండు మందారపూలని తీసికొచ్చి స్వామికి, అమ్మవారికి అలంకరించి పొంగి పోయి చప్పట్లు చరిచాడు.

ఆ సాయంత్రమే నంది వాహనం ఊరేగింపు. బజారు బజారంతా చెప్పాడు నేనే స్వామికి అలంకారం చేశానని - పిల్లలందర్నీ పోగేసుకొచ్చాడు నారాయణ. నంది వాహనం వొడ్డెర్లే మోయాలి. రాత్రి ఎనిమిదైనా వాళ్ళింకా రాలేదు. వాళ్ళకోసం మూడోసారి మనిషిని పంపించారు. దేవస్థానం ట్రస్టీ వాళ్ళనీ వీళ్ళనీ కేకలేస్తూ హడావుడిగా తిరుగుతున్నాడు.

వాహకులు ఆలస్యంగా వచ్చినందులకు మీ తప్పంటే మీ తప్పని అరుచు కొన్నారు జనం. ఎట్టకేలకు స్థానాపతిగారు మంత్రం చదువుతూ ముందు నడిచారు. వాద్యాలన్నీ ఒక్కసారి మోగాయి. విగ్రహాలు గుళ్ళోనించి క్రింది ప్రాకారానికొచ్చాయి. విగ్రహాల్ని నంది వాహనం మీది కెక్కించారు. కాని వాహనం లేవందే?

వొడ్డెర్లు తగూలాడు కుంటున్నారు. "నీయమ్మ! తప్పు నీదే! నీ యక్క! తప్పు నీదే!" వాదులాడుకొంటున్నారు. దెబ్బలాట ఒకటే తక్కువ. "వాహనం లేపండ్రా" అని అధికార్లు అరుపులు - "పట్టండ్రా! పట్టండ్రా" హర హర మహదేవ ......

నందివాహనం అటూ ఇటూ ఊగింది. విగ్రహాలు వొరిగాయి.

"ఒరేయ్ జాగ్రత్తరోయ్!" అర్చకుల అరుపులు.

ఊరేగింపుకు ముందు అర్చకుడు హారతి ఇస్తున్నాడు.

ఆ వూపుతో ఆ కుదుపుతో నారాయణ అలంకరించిన రెండు మందార పూలు ఎక్కడో పడిపోయాయి. నారాయణ బిక్కమొహం వేశాడు. కాని విగ్రహాలు నవ్వుతూనే ఉన్నాయి. తనూ నవ్వాడు.*